

టన్ను చీనీ రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు, కనిష్టంగా రూ.9 వేల ప్రకారం ధర పలికాయి.



సాయి నామం.. దివ్య చరితం

ఆషాఢ ఏకాదశి సందర్భంగా మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల భక్తులు ప్రశాంతి నిలయం చేరుకున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో అందరినీ అలరించారు.

8లో

గరిష్టం/కనిష్టం
34.4°/22.6°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లో 10,089 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లోనూ శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 10,089 కేసులు పరిష్కారమయ్యాయి. అనంతపురం జిల్లా కోర్టులో లోక్ అదాలత్‌ను ప్రధాన న్యాయమూర్తి భీమారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లోక్ అదాలత్ తీర్పుపై అప్పీలుకు అవకాశం ఉండదన్నారు. రెగ్యులర్ కోర్టులో కేసులు పరిష్కారమైతే ఎవరో ఒకరే గెలిచే అవకాశం ఉంటుందని, అదే లోక్ అదాలత్‌లో అయితే ఇరు పార్టీలు సంతోషంగా ఇంటికి చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్. రాజశేఖర్, మొదటి అదనపు జిల్లా జడ్జి సత్యవాణి, బార్ అసోసియేట్ ప్రెసిడెంట్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లో మోటారు వాహనాల ప్రమాద కేసులు 28 పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ.1,57,55,000 నష్ట పరిహారం ఇప్పించారు. సివిల్ కేసులు 75 పరిష్కారమయ్యాయి. వీటి విలువ రూ.5,35,59,388. ప్రీలిటిగేషన్ కేసులు 3,876 పరిష్కారం కాగా, ఇందులో మొత్తం రూ.1,98,98,382. ఎన్ఐ యాక్ట్ కేసులు-22 మొత్తం రూ.31,50,000.

10న మెగా పీటీఎం సమావేశాలు



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 10న జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ వి.రత్నతో కలిసి విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడానికి మెగా పీటీఎం సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి తల్లిందడ్రులతో కలసి పీటీఎంకి హాజరు కావాలని, ఉపాధ్యాయులందరూ విధిగా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరిస్తారన్నారు. అలాగే ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈఏడాది ప్రభుత్వ స్కూళ్లలో 1వ తరగతిలో 20,789 మంది, 6వ తరగతిలో 24 వేల మంది చేరారన్నారు. డ్రాప్ అవుట్స్ నివారించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. సామాజిక భాగస్వామ్యంతో పేదరికాన్ని నిర్మూలించడమే పీ-4 కార్యక్రమం లక్ష్యమన్నారు. తల్లికి వందనంకు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు 14,703 ఫిర్యాదులు అందాయని, అందులో 10,803 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మిగిలిన ఫిర్యాదులను మరోసారి పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

పట్టుపై ఆషాఢం



పట్టుచీరలకు అంతర్జాతీయంగా పేరుగాంచిన ధర్మవరం నిత్యం వివిధ ప్రాంతాల వ్యాపారులు, కొనుగోలు దారులతో కళకళలాడేది. రోజూ రూ.కోట్ల వ్యాపారం జరిగేది. కానీ ఆషాఢం దెబ్బకు పట్టుచీరల వ్యాపారం కళ తప్పింది. కొనుగోళ్లు లేక చీరలన్నీ సిల్క్‌షాపుల్లో ఉండిపోగా, అటు వ్యాపారులు, ఇటు నేతన్నలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

- ఆషాఢం సెంటిమెంట్‌తో తగ్గిన పట్టుచీరల కొనుగోళ్లు
- భారీ డిస్కౌంట్‌లు ఇస్తున్న షోరూం నిర్వాహకులు
- ఆ మేరకు చీర ధర తగ్గించాలని ధర్మవరం వ్యాపారులపై ఒత్తిళ్లు
- విధి లేక నష్టానికి పట్టు చీరలను విక్రయిస్తున్న వ్యాపారులు
- ఆశించిన స్థాయిలో సాగని విక్రయాలు



కొనుగోలు దారులు లేక వెలవెల బోతున్న పట్టుచీరల దుకాణం

ధర్మవరం: పట్టుచీరల ఎగుమతుల్లో ధర్మవరానిది ప్రత్యేక స్థానం. అందుకే నిత్యం ఇతర రాష్ట్రాల వ్యాపారులు రాక పోకలు..పట్టుచీరల అమ్మకాలతో సందడిగా ఉండే పట్టు చీరల మార్కెట్..నేడు కొనుగోలు దారుల రాక పోవడంతో వెలవెలబోతోంది. ఆషాఢమాసం కారణంగా శుభకార్యాలు లేక పోవడంతో పట్టుచీరల అమ్మకాలు మందగించాయి. పైగా షోరూంల నిర్వాహకులు భారీగా డిస్కౌంట్ అడుగుతుండటంతో పట్టుచీరల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ధర్మవరం నుంచి దేశవిదేశాలకు ఎగుమతి..

ధర్మవరంలోని నేసేపేటలో 1,650 వరకు పట్టు చీరల దుకాణాలు (సిల్క్‌హౌస్‌లు) ఉన్నాయి. ఈ సిల్క్‌హౌస్‌ల యజమానులు ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాల్లోని చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్‌ల నుంచి తమకు నచ్చిన డిజైన్‌లలో చీరలు తయారు చేయిస్తారు. చేనేత మగ్గం నుంచి తయారైన పట్టుచీరలు రూ.5 వేల నుంచి రూ.లక్ష , రూ.2 లక్షల వరకు ఉంటాయి. ఈ చీరలను దేశంలోని వివిధ పట్టణాలు, నగరాలతో పాటు దేశవిదేశాల్లో ఉన్న పట్టుచీరల షోరూంల యజమానులకు హోల్‌సేల్‌గా అమ్ముతారు. అందుకే వివిధ రాష్ట్రాల వ్యాపారులతో ధర్మవరం నిత్యం కళకళలాడేది.

మందకొడిగా విక్రయాలు..

రెండు నెలలుగా ధర్మవరం సిల్క్ మార్కెట్‌లో పట్టు చీరల విక్రయాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. సీజన్‌లో ధర్మవరం పట్టు మార్కెట్‌లో ప్రతివారం సగటున రూ.31 కోట్లకుపైగానే లావాదేవీలు జరుగుతాయని వ్యాపార వర్గాల అంచనా. ప్రస్తుతం రూ.10 కోట్ల వ్యాపారం కూడా జరగడం లేదని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా ఆషాఢ మాసంలో కేవలం 5 శాతం తక్కువ ధరకు పట్టుచీరలను విక్రయించడం ధర్మవరం పట్టువ్యాపారులకు ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది పట్టుమార్కెట్‌లో నిల్వలు పేరుకుపోవడం... పోటీతత్వంతో షోరూంల నిర్వాహకులు చెప్పినట్లు నడుచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆషాఢం సేల్ పేరుతో డిస్కౌంట్ ఇస్తున్న షోరూంల యజమానులు ఆ మేరకు చీరల ధర తగ్గించాలని ధర్మవరం వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నారు. పైగా చీరలు కొనుగోలు చేశాక డబ్బులిచ్చేందుకు 5 నుంచి 8 నెలల వరకూ సమయం తీసుకుంటుండటంతో వ్యాపారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. నేతన్నలకూ సకాలంలో డబ్బులు అందించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పట్టుచీరల దుకాణంలో పేరుకుపోయిన నిల్వలు

ముహూర్తాలపైనే ఆశ..

ప్రస్తుత ఆషాఢ మాసంలో నష్టాలను పూడ్చాలంటే రానున్న శ్రావణం, మాఘమాసం, దసరా, దీపావళి పండుగలలో జరిగే వ్యాపారంపై వ్యాపారులు ఆశపెట్టుకున్నారు. ఈ సీజన్‌లో పట్టుచీరల విక్రయాలు జోరందుకుంటాయని వ్యాపారులు చెబుతున్నారు. దీనికి తోడు ఈ ఏడాది పంటలు బాగా పండితేనే పట్టుచీరల వ్యాపారం గాడిలో పడే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే వర్షాభావ పరిస్థితులు కనిపిస్తుండటంతో వ్యాపార వర్గాల్లో తీవ్ర ఆందోళన మొదలైంది.

మార్కెటింగ్ కల్పించాలి



అన్‌సీజన్ కారణంగా పట్టుచీరల అమ్మకాలు బాగా తగ్గాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా షోరూం నిర్వాహకులు ఆషాఢం డిస్కౌంట్ ఇవ్వాలంటున్నారు. దీంతో మేం నష్టపోతున్నాం. ప్రభుత్వం పట్టుచీరల వ్యాపారులకు సొసైటీల ద్వారా అన్‌సీజన్‌లో పట్టు ఉత్పత్తులను కొనుగోలు చేసేలా చర్యలు చేపడితే ప్రయోజనం ఉంటుంది. అలాగే పరిశ్రమల శాఖ నుంచి రాయితీ రుణాలను అందివ్వాలి. చేనేత కార్మికులకు ముడిపట్టురాయితీలు తదితర ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా పట్టు చీరల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది.

– రంగన శ్రీనివాసులు, పట్టుచీరల వ్యాపారి, ధర్మవరం.

తీవ్రంగా నష్టపోతున్నాం



ఆషాఢం ఎఫెక్ట్ పట్టుచీరల వ్యాపారంపై తీవ్రంగా చూపుతోంది. ఇప్పటికే చేనేత సంక్షోభం కారణంగా పట్టుచీరల ఉత్పత్తి తగ్గింది. అన్‌సీజన్ కారణంగా రూ.లక్షల పెట్టుబడి స్తంభించిపోతోంది. ఆషాఢం డిస్కౌంట్ సేల్స్, అన్‌సీజన్ పట్టుచీరల వ్యాపారులకు నష్టాలు తెచ్చిపెడుతున్నాయి. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

– నరేంద్ర, పట్టుచీరల వ్యాపారి, ధర్మవరం.

బొలెరో.. బైక్ ఢీ: ఇద్దరు మృతి



సంఘటనాస్థలంలో బొలెరో ముందు పడి ఉన్న బైకు





మృతి చెందిన ఓబిలేసు, సదాశివ

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి బైపాస్ రోడ్డులోని వేల్పుమడుగు క్రాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన ఓబిలేసు(38) శనివారం ఉదయం తన బైక్‌పై బత్తలపల్లి నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. ఇదే సమయంలో పీర్లను దర్శించుకునేందుకు గంటాపురం వెళ్లేందుకు రోడ్డుపై ఉన్న సదాశివ(32)ను తన బైక్‌పై ఎక్కించుకున్నాడు. వీరి వాహనం బత్తలపల్లి బైపాస్ వద్ద వేల్పుమడుగు రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో అనంతపురం నుంచి తమిళనాడుకు జీవాలతో వెళ్తున్న బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వారిరువురూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్, ఏఎస్ఐ సోమశేఖర్ మూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను హైవే అంబులెన్స్‌లో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న గంటాపురం గ్రామస్తులు, మృతుల బంధువులు సంఘటనాస్థలానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. నిర్జీవంగా ఉన్న తమ వారిని చూసి వారంతా కన్నీరు మున్నీరయ్యారు. ఓబిలేసుకు భార్య రమణమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. సదాశివకు భార్య శివకాంతతో పాటు ఒక కుమారుడు ఉన్నారు. ఈ మేరకు బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అమాయకుల జోలికెళ్తే ఊరుకోం



నరికివేసిన మామిడి చెట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, రైతులు, నాయకులు

- రాజకీయ కక్షతో పచ్చని చెట్లు కొట్టడం దుర్మార్గం
- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: అధికారం ఉంది కదా అని అమాయకుల జోలికి వెళ్తే ఊరుకునే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కూటమి నాయకులను హెచ్చరించారు. ఐదురోజుల క్రితం పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరనారప్ప కుటుంబీకులకు చెందిన మామిడి తోటలో సుమారు 300 చెట్లను ప్రత్యర్థులు నరికి వేసిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం పార్టీ నాయకులతో కలిసి వెంగళమ్మచెరువుకు వెళ్లారు. మామిడి తోటకు వెళ్లి దుండగులు నరికిన చెట్లను పరిశీలించారు. బాధిత రైతులకు భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక నగరిగా పేరొందిన పుట్టపర్తిలోనూ రెడ్ బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోందన్నారు. చెట్లు నరికే విష సంస్కృతికి కూటమి నేతలు బీజం వేస్తున్నారని మండిపడ్డారు. అధికారం ఎంతో కాలం ఉండదన్న విషయం ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. ప్రజలు, రైతులు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. రైతులు ఆరుగాలం శ్రమించి కంటికి రెప్పలా కాపాడుకున్న మామిడి చెట్లను నరికి వేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అక్కడి నుంచే పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్న రైతు వీరనారప్ప కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వెంట ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు ఈశ్వరయ్య, రవినాయక్, మాజీ కన్వీనర్లు నరసారెడ్డి, గంగాద్రి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, తిప్పారెడ్డి ఉన్నారు.

పుట్టపర్తిలో ఇసుక తోడేళ్లు

- చిత్రావతి నదిని తోడేస్తున్న 'తమ్ముళ్లు'
- పగలు, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుక దోపిడీ
- ప్రశ్నించిన ఓ ఇరిగేషన్ అధికారికి బెదిరింపులు
- ఉన్నతాధికారులకు భారీగా సమర్పించుకున్నామని వెల్లడి



దుర్గమ్మ గుడి పక్కన చిత్రావతి నదిలో ఇసుక తోడేస్తున్న దృశ్యం



పట్టపగలే పుట్టపర్తి మెయిన్ రోడ్డులో ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టరు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాగానే టీడీపీ నాయకులు సహజ వనరులపై కన్నేశారు. ముఖ్యంగా బాగా డిమాండ్ ఉన్న ఇసుకనే ఆదాయ వనరుగా మార్చుకున్నారు. అధికారం అడ్డు పెట్టుకుని.. అధికారులను మామూళ్ల మత్తులో జోకొట్టి.. నదుల నుంచి యథేచ్ఛగా ఇసుక దోపిడీ చేస్తున్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తి సమీపంలోని చిత్రావతి నది నుంచి పట్టపగలే ట్రాక్టర్ల ద్వారా భారీగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఇసుక రవాణాకు ప్రత్యేక వ్యవస్థ

కూటమి నేతలు కొందరు సిండికేటుగా మారి చిత్రావతి నదిలో ఇసుక అమ్మకాలకు శ్రీకారం చుట్టారు. ఇసుకను అక్రమంగా తరలించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నారు. చిత్రావతి నదిలోకి ట్రాక్టర్లు వెళ్లేందుకు పుట్టపర్తి దుర్గమ్మ గుడి పక్క నుంచి రోడ్డు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి హారతి ఘాట్ మీదుగా కర్ణాటక నాగేపల్లి బ్రిడ్జి వరకు ఇసుక ట్రాక్టరుకు ముందుగా రెండు బైకులు వెళ్తుంటాయి. ఏదైనా ఇబ్బందులుంటే బైక్‌పై ఉన్న వ్యక్తులు ముందే సమాచారం ఇస్తారు. అలాగే ఇసుక ట్రాక్టర్ వెనుక కూడా రెండు బైకులు వస్తుంటాయి. వెనుక నుంచి ఎవరు వచ్చినా బైక్‌లపై ఉన్న వారు చూసుకుంటారు. ఇలా కర్ణాటక నాగేపల్లి బ్రిడ్జి వరకూ ఇసుక ట్రాక్టర్లకు రక్షణగా వెళ్తారు. ఇలా ఇసుక ట్రాక్టర్‌కు రక్షణగా వెళ్లినందుకు ఒక్కో ట్రాక్టర్ నుంచి రూ.500 వసూలు చేస్తున్నట్లు తెలిసింది. డబ్బులు ఇవ్వని ట్రాక్టర్ల సమాచారం పోలీసులకు ఇచ్చి పట్టిస్తారు. ఎనుములపల్లి శివారు నుంచి ఒక సమూహం.. దుర్గమ్మ గుడి దగ్గర నుంచి మరో గ్రూపు.. ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక తరలిస్తూ భారీగా వెనుకేసుకుంటున్నారు.

కావాలంటే రూ.1,000 తీసుకో..

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఎవరైనా అధికారి వెళితే...ఆయనకూ మామూళ్ల ఎర వేస్తారు. వినకపోతే వారి ఉన్నతాధికారుల పేర్లు చెప్పి భయపెడతారు. ఈ క్రమంలోనే శనివారం మధ్యాహ్నం చిత్రావతి నదిలో ఇసుకను ట్రాక్టర్లకు నింపుతుండగా.. ఇరిగేషన్ అధికారి ఒకరు అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. అయితే 'మీ పై అధికారులకు లంచం ఇచ్చాం. ఈ రోజంతా తరలిస్తూనే ఉంటాం. నీకూ కావాలంటే రూ.వెయ్యి ఇస్తాం. ఈ రోజంతా ఇటు వైపు చూడొద్దు. కాదు.. కూడదు అంటే ఇష్టం వచ్చింది చేస్కో. ఎమ్మెల్యే దగ్గర నుంచి పర్మిషన్ తెచ్చుకున్నాం. మా ప్రభుత్వంలో మమ్మల్ని ఎవరు అడ్డుకునేది' అంటూ సమాధానం ఇచ్చారు. దీంతో సదరు అధికారి మారుమాట్లాడకుండా అక్కడి నుంచి వెనక్కు వచ్చారు. అనంతరం నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కాకపోతే పోలీసులు వచ్చే లోపు ఇసుకాసురులు అక్కడి నుంచి పరారయ్యారు. ఇలా వారు తప్పించుకుని వెళ్లేందుకు కూడా కొందరు సహకరించినట్లు తెలుస్తోంది.

రమణీయం..
రథోత్సవం



శ్రీకృష్ణ బలరామ సుభద్ర ఉత్సవమూర్తులు

- వైభవంగా జగన్నాథుడి రథయాత్ర
- పురంలో మార్మోగిన శ్రీకృష్ణ నామస్మరణ



రథం ముందు భజనలు చేస్తూ ముందుకు సాగుతున్న భక్తులు



రథయాత్రలో చిన్నారుల కోలాటం

హిందూపురం: 'హరేరామ... హరే కృష్ణ' నామస్మరణతో హిందూపురం పురవీధులు మార్మోగాయి. హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బహుద రథయాత్ర హిందూపురంలో వైభవంగా సాగింది. తొలుత స్థానిక పాలిటెక్నికల్ కళాశాల కృష్ణాలాండ్ వద్ద గోవింద చరణ్ దాస్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ బలరామ సుభద్రాదేవీ ఉత్సవమూర్తులకు పూజలు చేసి ప్రత్యేకంగా సిద్ధం చేసి 32 అడుగుల రథంలో కొలువుదీర్చారు. అనంతరం ఆశేష భక్త జనుల నడుమ ప్రారంభమైన జగన్నాథ రథయాత్ర బైపాస్‌రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, అంబేడ్కర్ సర్కిల్, వాసవీధర్మశాల ఫంక్షన్ హాలు మీదుగా వాల్మీకి భవన్‌కు చేరింది. రథయాత్రలో మహిళలు కోలాటం, చిన్నారులు భరతనాట్యం చేశారు. కృష్ణ సంకీర్తనలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు. వాల్మీకి భవన్ వద్ద శ్రీకృష్ణ బలరామ సుభద్రాదేవి ఉత్సవ మూర్తులకు విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, కొటిపి హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

మొహర్రం..ఆధ్యాత్మిక సౌరభం

- భేటీకి వివిధ గ్రామాల పీర్లకు స్వాగతం పలికిన బత్తలపల్లి పీర్లు
- ఆయా గ్రామాల్లో బత్తలపల్లి పీర్లకు ఘనస్వాగతం



బత్తలపల్లిలో ఊరేగుతున్న ఖాశీంస్వామి

బత్తలపల్లి: మొహర్రం సందర్భంగా ఆధ్యాత్మిక సౌరభాలు వికసిస్తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం బత్తలపల్లిలోని ఖాసీంస్వామి పీర్లు భేటీకి రావాలని వివిధ గ్రామాల పీర్లకు ఆహ్వానం పలికేందుకు గ్రామాల పర్యటనకు వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మికత వెల్లివెరిసింది.

ఉదయం గ్రామోత్సవం..

బత్తలపల్లి, గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాల్లో ఉదయం పీర్లకు గ్రామోత్సవం నిర్వహించారు. వందలాది మంది భక్తులు పీర్ల వెంట నడిచారు. తమ ఇళ్ల వద్దకు వచ్చిన పీర్లకు భక్తులు చక్కెర చదివించారు. అలావ్ తొక్కుతూ సందడి చేశారు. అనంతరం బత్తలపల్లి పీర్లు గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రికి వెళ్లగా.. ఆయా గ్రామాల పెద్దలు పీర్లతో ఎదురేగి స్వాగతం పలికారు. అనంతరం బత్తలపల్లి పీర్లు రాత్రికి మకాన్‌కు చేరుకున్నాయి. కాగా, మొహర్రం ఉత్సవాల్లో భాగంగా పీర్లస్వాముల వెంట వచ్చిన భక్తులకు, ప్రజలకు మాజీ సర్పంచు సింగారం నాగేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అదే విధంగా బత్తలపల్లి ఎస్సీ కాలనీవాసుల ఆధ్వర్యంలోనూ అన్నదాన కార్యక్రమం జరిగింది.



గంటాపురం పీర్లుతో బేటీ తీసుకుంటున్న బత్తలపల్లి పీర్లు



వేల్పుమడుగులో అగ్నిగుండం చుట్టూ అలావ్ తొక్కుతున్న గ్రామస్తులు

సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలి



స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి కిట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకుని నేరాల నియంత్రణకు గట్టిగా కృషి చేయాలని స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి ఎస్పీ రత్న సూచించారు. శనివారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో సమావేశం నిర్వహించి కిట్లు, లెదర్ బ్యాగులు పంపిణీ చేశారు. క్షేత్రస్థాయిలో స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది నిర్వహించాల్సిన విధులపై దిశానిర్దేశం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత అధునిక యుగంలో సాంకేతిక నైపుణ్యాలను ప్రతి పోలీస్ అధికారి మెరుగుపరుచుకోవాలన్నారు. నేర నియంత్రణలో స్పెషల్ బ్రాంచ్ పాత్ర కీలకమన్నారు. జిల్లా వ్యాప్తంగా ఫ్యాక్షన్ గ్రామాల్లో గొడవలు జరగకుండా ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం తెలుకొని నియంత్రణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐ వలి, సోషల్ మీడియా ఎస్ఐ మునిప్రతాప్‌తోపాటు స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

మోసపోతున్నా.. మేలుకోరా?

'లుక్' యాప్ బాధితులు 20 వేల మంది పైనే

- అత్యాశే కొంప ముంచిన వైనం
- బాధితుల్లో ఉపాధ్యాయులు, ఐటీ ఉద్యోగులూ
- పోలీసులకు ఫిర్యాదు చేయడానికీ ముందుకు రాలేక ఇబ్బంది

- కురుగుంటకు చెందిన సురేష్ రూ.40 వేలు లుక్ యాప్‌లో డిపాజిట్ చేశాడు. నాలుగు రోజులు బాగానే సంపాదించాడు. ఈ క్రమంలోనే మరో 10 మందిని చేర్పించాడు. వారం రోజుల తర్వాత చూస్తే మొత్తం కంపెనీ ఎత్తేశారు. తనతో పాటు తాను కట్టించిన వారి డబ్బంతా పోయింది. దీంతో అవమానంగా భావించిన సురేష్ ఇటీవల ఇంటి నుంచి అసలు బయటకు రావడం లేదు.
- అనంతపురం నగరంలో ఓ ప్రైవేటు బ్యాంకులో పని చేస్తున్న పరమేష్.. తన పిల్లలకు స్కూలు ఫీజులకైనా డబ్బులు సంపాదించవచ్చనే ఉద్దేశంతో 'లుక్' యాప్‌లో రూ.20 వేలు కట్టాడు. కట్టిన నాలుగు రోజులకే కంపెనీ మూసేశారు. దీంతో వారం రోజుల నుంచి బ్యాంకుకు సెలవు పెట్టి ఇంట్లోనే కూర్చున్నాడు. వీరిద్దరే కాదు.. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా 'లుక్' బాధితులు వేలల్లోనే ఉన్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆశ ఉండొచ్చుగానీ.. అత్యాశ ఉండకూడదు అంటారు. ఈ అత్యాశే వేల మందిని ముంచేసింది. డబ్బు పోగొట్టుకునేలా చేసింది. రోజుకో యాప్.. రోజుకో సైబర్ మోసం పత్రికల్లో చూస్తూనే ఉన్నా ఎగబడి మరీ కట్టేశారు. చివరకు బిచాణా ఎత్తేస్తే గానీ వాని అసలు విషయం తెలియరాలేదు. వారం రోజుల క్రితం 'లుక్ యాప్' గొలుసుకట్టు ఫైనాన్స్ పేరుతో బురిడీ కొట్టించిన కేసులో ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల మంది రూ.30 కోట్లు పైనే పోగొట్టుకున్నట్టు పోలీసులు అంచనా వేస్తున్నారు.

ఉపాధ్యాయులు..ఐటీ ఉద్యోగులూ..

పిల్లలకు జీవిత పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు సైతం 'లుక్' ఉచ్చులో ఇరుక్కోవడం విస్మయం కలిగిస్తోంది. రూ.20 వేలు కడితే రోజూ రూ.700 ఇస్తామని అనడంతో



రెండు జిల్లాలో సుమారు 800 మందికి పైగా ఉపాధ్యాయులు 'యాప్'లో డబ్బులు పోశారు. ఇక ఐటీ ఉద్యోగులు వచ్చే జీతాలు సరిపోకనో లేదా అత్యాశకు వెళ్లారో గానీ వేలకు వేలు ఎగబడి కట్టారు. చివరకు మాయగాళ్లు మొత్తం ఊడ్చుకుని నిండా ముంచేశారు. అనంతపురంలోని కమలానగర్‌లో వ్యాపారులు ఒకరికి తెలియకుండా ఒకరు భారీ సంఖ్యలో డబ్బులు కట్టి మోసపోయినట్టు తెలుస్తోంది. లుక్ యాప్ ఎక్కడిదో, యజమాని ఎవరో, కార్యాలయం ఎక్కడో ఎవరికీ తెలియదు. వేలం వెర్రిగా కట్టేశారంతే!

గతంలో మోసాలు జరిగినా...

గతంలో అనంతపురం జిల్లా కేంద్రంగా భారీ స్కాములు జరిగాయి. ఈ-బిడ్ పేరుతో లక్ష రూపాయలు కడితే నెలకు రూ.30 వేలు ఇస్తామని చెప్పగా వేల మంది కట్టారు. నాలుగైదు నెలలు బాగానే ఇచ్చారు. ఆ తర్వాత బోర్డు తిప్పేశారు. రూ.230 కోట్ల మేర బాధితులకు శఠగోపం పెట్టారు. దీంతో కొంతమంది బాధితులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆ తర్వాత జయలక్ష్మి అనే మహిళ రూ.30 కోట్ల మేరకు చిట్టీల పేరుతో కుచ్చుటోపీ పెట్టింది. తర్వాత కొద్దిరోజులకే ఆదరణ చిట్స్ పేరుతో రూ.50 కోట్లు ఎగ్గొట్టారు. ఇలా పలు ఘటనలు జరిగినా అత్యాశకు పోవడం వల్లే మోసపోతున్నట్టు తెలుస్తోంది.

భక్తరపల్లిలో రేపు భూతప్ప ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

మడకశిర రూరల్: తొలి ఏకాదశి వేడుకలను పురస్కరించుకుని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద భూతప్ప ఉత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మినీ భూతప్ప ఉత్సవాలు ఉంటాయని దేవదాయశాఖ అధికారులు తెలిపారు. దీర్ఘకాలికంగా వ్యాధులతో బాధపడుతున్న వారు, సంతానం లేని మహిళలు ఉత్సవాలకు భారీగా తరలివస్తారని ఆలయ కమిటీ అంచనా వేస్తోంది. ఈమేరకు ఏర్పాట్లు చేసింది.

జాతీయస్థాయి హాకీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన జిల్లా క్రీడాకారిణులు

ధర్మవరం: జార్ఖండ్ రాజధాని రాంచీలో జరుగుతున్న 15వ జాతీయస్థాయి సబ్ జూనియర్ మహిళల హాకీ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు జిల్లాకు చెందిన క్రీడాకారిణులు మధురిమ బాయి, వైష్ణవి, వర్ష ఎంపికయ్యారని హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్ శనివారం తెలిపారు. అలాగే కేరళ రాష్ట్ర జట్టుకు తలారి హేమ ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారిణులను హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్, జిల్లా గౌరవాధ్యక్షులు బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, ఉపాధ్యక్షులు ఉడుముల రామచంద్ర, గౌరీప్రసాద్, మహమ్మద్ అస్లాం, ఊకా రాఘవేంద్ర, ట్రెజరర్ అంజన్న, జాయింట్ కార్యదర్శి అరవింద్‌గౌడ్, చందు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ హాకీ కోచ్ హుస్సేన్, డైరెక్టర్లు మారుతి, ఇర్షాద్, అమునుద్దిన్, కిరణ్ హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో పలువురికి అవకాశం

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురికి రాష్ట్ర కమిటీలో చోటు లభించింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా రాప్తాడుకు చెందిన కురుబ నాగిరెడ్డి, గంగన గోపాల్‌రెడ్డి, ముదిగుబ్బకు చెందిన వీరాంజనేయులు, అంకే లక్ష్మన్న, పుట్టపర్తికి చెందిన పి.సుధాకరరెడ్డి, జి.శేషురెడ్డిలను నియమించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో చోటు

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర కమిటీల్లో జిల్లా నుంచి పలువురికి చోటు కల్పించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యువజన విభాగం అధికార ప్రతినిధిగా వి.అమరనాథరెడ్డి (ధర్మవరం), రాష్ట్ర వలంటీర్ల విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా టి.గంగాధర్‌రెడ్డి (పెనుకొండ), ఎస్టీ సెల్ జాయింట్ సెక్రటరీగా డి.లక్ష్మానాయక్ (ధర్మవరం) స్టేట్ పబ్లిసిటీ వింగ్ జనరల్ సెక్రటరీగా కె.సురేష్‌కుమార్‌రెడ్డి (హిందూపురం) స్టేట్ పబ్లిసిటీ వింగ్ సెక్రటరీగా జి,రమేష్ (ధర్మవరం) స్టేట్ పంచాయతీ వింగ్ జనరల్ సెక్రటరీగా కె.నాగరాజు (పుట్టపర్తి)స్టేట్ పంచాయితీ వింగ్ సెక్రటరీగా కె. రవీంద్రరెడ్డి (పుట్టపర్తి)నియమిస్తూ పార్టీ ఆదేశాలు జారీ చేసింది.

ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'కొర్రపాడు'



కొర్రపాడు హుస్సేన్ పీరా, రాజశేఖర్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన ఇద్దరికి అవకాశం కల్పించారు. ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అనంతపురానికి చెందిన కొర్రపాడు హుస్సేన్‌పీరా, రాష్ట్ర కార్యదర్శిగా బి.రాజాశేఖర్‌రెడ్డి (రాజారెడ్డి)ని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి.

తీరుమార్చుకోని అధికారులు

- చేయని పనులకు బిల్లుల మంజూరు యత్నం
- కాంట్రాక్టర్ రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసిన హైకోర్టు
- విషయాన్ని దాచిన మున్సిపల్ శాఖ అధికారులు

చిలమత్తూరు: హిందూపురం మున్సిపల్ శాఖలో కొందరు అధికారుల తీరు మారడం లేదు. కమిషనర్ ఎవ్వరు వచ్చినా కాంట్రాక్ట్ పనులు ఆయనకే దక్కేలా చేస్తున్నారు. ప్రభాకర్ అనే కాంట్రాక్టర్ అంటే అధికారులకు అమితమైన ప్రేమ అని ప్రజలు చర్చించుకుంటున్నారు. 2013లో కాంట్రాక్టర్ ప్రభాకర్ చేసిన సీసీ రోడ్డు పనుల్లో అవినీతి జరిగిందంటూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. పనుల్లో నాణ్యత లేకపోవడంతో రూ.22.50 లక్షలు రికవరీకి ఆదేశించారు. అంతేకాకుండా సదరు కాంట్రాక్టర్ లైసెన్స్‌ను కూడా బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సిఫారసు చేశారు. ఆ వ్యక్తి వేసిన టెండర్లన్నీ రద్దు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు రిపోర్టు కూడా ఇచ్చారు. అంతే కాకుండా అందుకు సహకరించిన ఏఈ, డీఈఈ,, ఈఈల ఇంక్రిమెంట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారు. దాని ప్రకారంగా సదరు అధికారుల ఇంక్రిమెంట్స్‌లో కోత పెట్టడంతో పాటు రెండేళ్ల పాటు పదోన్నతి రాకుండా చేశారు. మున్సిపల్ కమిషనర్ ఆర్‌సీ నంబర్ 1355.2013.ఈ1 30.10.2013లో నోటీసు కూడా అందించారు. అయితే దీనిపై సదరు కాంట్రాక్టర్ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసి తాత్కాలికంగా ఉపశమనం పొందాడు. చివరకు ఆ రిట్ పిటిషన్‌ను గత ఏడాది జూలై 29న హైకోర్టు డిస్మిస్ చేసింది.

రికవరీపై నోరు మెదపని అధికారులు..

రోడ్లు నాణ్యతగా చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్ ప్రభాకర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విధించిన రికవరీ సొమ్ము కట్టకుండా కోర్టును ఆశ్రయించి భంగపడ్డారు. ఏడాదిగా డబ్బు కట్టకుండా మిన్నకుండిపోయినా మున్సిపల్‌శాఖ అధికారులు ఏమాత్రమూ పట్టించుకోవడం లేదు. హైకోర్టు కేసును డిస్మిస్ చేసిన విషయాన్ని ఏడాదిగా గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ఆయన లైసెన్సును కూడా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాల్సి ఉన్నా ఏడాదిగా నాన్చుడు ధోరణి అవలంబిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతే కాకుండా మున్సిపల్ శాఖకు కట్టాల్సిన రికవరీ సొమ్ము చేరకనే ఇప్పుడు మళ్లీ రూ.83 లక్షల కాంట్రాక్ట్ పనులు ఇచ్చి బిల్లులు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అంతటితో ఆగకుండా రూ.60 లక్షల పైచిలుకు పనులు కట్టబెట్టడంపైనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వెంటనే సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టి సొమ్ము రికవరీ చేసి మున్సిపాలిటీలో జమ చేయాలని హిందూపురం వాసులు డిమాండ్ చేస్తున్నారు.

రేపు ఫుట్‌బాల్ జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో సోమవారం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సబ్ జూనియర్స్ బాల, బాలికల జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు జేవీ అనిల్ కుమార్ పేర్కొన్నారు. 2012 జనవరి 1 నుంచి 2013 డిసెంబర్ 31 లోపు జన్మించిన వారు అర్హులని, ఆసక్తి గల వారు తమ ఆధార్, బర్త్ సర్టిఫికెట్, మూడు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకుని రేపటి ఎంపిక కార్యక్రమానికి రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా కార్యదర్శి మహమ్మద్ సలీమ్‌ను 80995 98958 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వివాహితపై యువకుడి అసభ్య ప్రవర్తన

కనగానపల్లి: లిఫ్ట్ ఇస్తానని వివాహితను ద్విచక్రవాహనంలో ఎక్కించుకున్న యువకుడు ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. భయాందోళనకు గురైన వివాహితపై అతని నుంచి తప్పించుకునేందుకు బైక్‌పై నుంచి దూకేయడంతో గాయపడింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన వివరాలు స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు ఇలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం మండలంలోని ఓ గ్రామం నుంచి కనగానపల్లికి వెళ్లేందుకు ఓ వివాహిత వాహనం కోసం ఎదురు చూస్తోంది. ఇంతలో ద్విచక్రవాహనంపై వచ్చిన బ్రహ్మ అనే యువకుడు తాను కూడా కనగానపల్లి వెళ్తున్నానని చెప్పి ఆమెను ఎక్కించుకున్నాడు. కొంతదూరం వచ్చాక వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు తగరకుంట వైపు బైక్‌ను మళ్లించాడు. భయపడిపోయిన ఆమె వేగంగా వెళ్తున్న బైక్‌పై నుంచి కిందకు దూకేసింది. ఈ క్రమంలో ఆమె తీవ్రంగా గాయపడింది. ఆ మార్గంలో వస్తున్న వారు గమనించి వివాహితను ప్రైవేట్ వాహనంలో ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తలకు గాయం కావడంతో స్పృహ కోల్పోయిన ఆమె రెండు రోజుల తర్వాత జరిగిన సంఘటన గురించి కుటుంబ సభ్యులకు తెలియజేసింది. అనంతరం ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడు బ్రహ్మను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

పారిశుధ్య కార్మికునికి పాముకాటు



చికిత్స పొందుతున్న శాంతమూర్తి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎర్రగుంట రైల్వే బ్రిడ్జి సమీపంలోని పార్కు వద్ద శనివారం శుభ్రం చేస్తున్న సమయంలో మున్సిపల్ ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడు శాంతమూర్తికి పాము కాటు వేసింది. గట్టిగా కేకలు వేయడంతో తోటి కార్మికులు వచ్చి ఆయన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్సన్ కార్మికుడు శాంతమూర్తిని ఆస్పత్రిలో పరామర్శించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు ప్రథమ చికిత్స అనంతరం కార్మికుడిని పుట్టపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శాంతమూర్తి ఆరోగ్యం నిలకడగా ఉందని తోటి కార్మికులు తెలిపారు. ఇదిలా ఉండగా కాటు వేసిన పామును కార్మికులు పార్కులోనే చంపేశారు.

ఖాద్రీ ఆలయానికి పోటెత్తిన భక్తులు

కదిరి టౌన్: స్వామివారి జన్మదిన నక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. కదిరి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, వైఎస్సార్, చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. నమో నారసింహ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

నీటి కుంటలో వృద్ధుడి మృతి

గోరంట్ల: మల్లెల- రాంపురం గ్రామాల మధ్యనగల నీటికుంటలో ఓ వృద్ధుడు మృతి చెందినట్లు శనివారం రాత్రి గుర్తించారు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని వెలికితీస్తామని సీఐ బోయ శేఖర్ తెలిపారు. మృతుడు ఎవరు.. మరణానికి దారి తీసిన కారణాలను తెలియాల్సి ఉందన్నారు.

'గురుకుల' ప్రవేశాలకు 8న కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో మిగులు సీట్ల ప్రవేశాలకు ఈనెల 8న అనంతపురం రూరల్ మండలం కురుగుంట గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి కె.జయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. బీఆర్ఏజీ సెట్-2025 మెరిట్ జాబితా ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. 8న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. తాము ఫోన్‌ద్వారా సమాచారం అందించిన విద్యార్థులు మాత్రమే హాజరుకావాలని సూచించారు.

తుంగభద్ర జలాశయం కళకళ

బొమ్మనహాళ్: ఎన్నడూ లేని విధంగా జూలై మొదటి వారంలోనే తుంగభద్ర జలాశయం కళకళలాడుతోంది. రోజురోజుకూ వరద ఉధృతి పెరుగుతుండడంతో 19 క్రస్ట్ గేట్లను రెండున్నర అడుగుల మేర పైకెత్తి 54,816 క్యూసెక్కుల నీటిని నదికి, 6 వేల క్యూసెక్కుల నీటిని వివిధ కాలువలకు మొత్తం కలిపి 61,470 క్యూసెక్కులు బయటికి వదులుతున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలోని పలు జిల్లాల ప్రజలకు తాగు, సాగునీరందించే ఉమ్మడి ప్రధాన జలాశయమైన తుంగభద్ర పరవళ్లు తొక్కుతుండటంతో రైతులు పంటల సాగుకు ముందుకు కదులుతున్నారు.

సాయి నామం.. దివ్య చరితం



పాదయాత్రగా వస్తున్న ఆశాడీ దిండి యాత్రికులు



బాలవికాస్ చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

ప్రశాంతి నిలయం: ఆశాఢ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మహారాష్ట్ర, గోవా సత్యసాయి భక్తులు చేపట్టిన ఆశాడీ దిండి పర్తియాత్ర శనివారం ప్రశాంతి నిలయం చేరుకుంది. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ రాజు యాత్రికులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం యాత్రికులు సత్యసాయి మహాసమాధి చెంత పల్లకీని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. అంతకుముందు వారు ధర్మవరం రైల్వేస్టేషన్‌లో రెండు రోజుల క్రితం దిగి అక్కడి నుంచి సత్యసాయి పల్లకీని ఊరేగిస్తూ పాదయాత్రగా పుట్టపర్తికి చేరుకున్నారు. సత్యసాయి వేషధారణలో సత్యసాయి బోధించిన మానవతా విలువలను ప్రచారం చేస్తూ పాదయాత్ర సాగించారు.

అలరించిన సంగీత కచేరీ

ఆశాఢ ఏకాదశి సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసురాలు ఆర్యా అంబేకర్ బృందం నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది. ఆశాఢ ఏకాదశి విశిష్టతను వివరిస్తూ చక్కటి భక్తి గీతాలను ఆలపించారు. బాలవికాస్ చిన్నారులు ఆశాఢ ఏకాదశి వైభవాన్ని చాటే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



సంగీత విభావరి నిర్వహిస్తున్న ఆర్యా అంబేకర్ బృందం